సాక్షి ఒడిశా
శనివారం । 19 । ఏప్రిల్ । 2025



టన్నెల్ సందర్శన
భారతమాల టన్నెల్‌ను నాయకులు సందర్శించారు. నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు.
- 10లో



ఆలయ ప్రతిష్ఠాపనోత్సవం
పర్లాకిమిడిలో గౌరీ నీలకంఠేశ్వర ఆలయ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. భక్తులు అధికంగా వచ్చారు.
- 10లో



విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి..
విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి ఓ బాలుడు బలైపోయాడు. కొరాపుట్ జిల్లాలో ఘటన జరిగింది.
- 10లో

న్యూస్‌రీల్

27న సిల్వర్ జూబ్లీ వేడుకలు



మాట్లాడుతున్న ప్రభాకర్

కొరాపుట్: ఈ నెల 27న జయపూర్ చాంబర్ ఆఫ్ కామర్స్ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తామని చాంబర్ అధ్యక్షుడు వి.ప్రభాకర్ ప్రకటించారు. శుక్రవారం జయపూర్ పట్టణంలోని వేదిక ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంస్థ ఏర్పడి అర్ధ శతాబ్దం పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీనిలో భాగంగా పది మంది సీనియర్ సభ్యులను సన్మానం చేస్తామన్నారు. ప్రస్తుతం సంస్థలో సుమారు 900 మంది వ్యాపారవేత్తలు ఉన్నారని, వారంతా రెండో పూట వర్తక, వాణిజ్య సంస్థలు మూసి వేసి హాజరుకావాలని కోరారు. సమావేశంలో చాంబర్ కార్యదర్శి డి.మాధవ, సభ్యులు పాల్గొన్నారు.

సాహితీ ఉత్సవాలకు ఆహ్వానం



సింహాద్రి శ్రీనివాసరావు

జయపురం: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో మే 10,11వ తేదీల్లో శ్రీశ్రీ కళా వేదిక నేతృత్వంలో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ ఉత్సవాలకు జయపురం కవి, పాత్రికేయులు సింహాద్రి శ్రీనివాసరావుకు ఆహ్వానం అందింది. ఉత్సవాలకు హాజరై తెలుగు భాషా పురస్కారాన్ని అందుకోవాల్సిందిగా శ్రీశ్రీ కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, కళారత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ డాక్టర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథిలు ఆహ్వానం పంపించారని శ్రీనివాసరావు శుక్రవారం పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్‌లో రక్తదానం



రక్తదానం చేస్తున్న మహిళ

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్‌లో ఒడిశా డిప్లొమా ఇంజినీర్స్ సంఘం, ఆమో ఒడిశా సంస్థలు సంయుక్తంగా శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశాయి. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ్ ఖెముండొ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్లొమా ఇంజనీర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్లొమా ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు ఎస్.సోమేశ్వరరావు, ఆమో ఒడిశా ప్రతినిధి శివప్రసాద్ దొర, ప్రభుత్వ ఆస్పత్రి రక్తనిధి విభాగం ఇన్‌చార్జి డాక్టర్ గౌతం పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త

రాయగడ: భార్యను గొంతు నులిమి భర్త హత్య చేసిన ఉదంతం జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గల చందిలి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చందిలి గ్రామంలో నివసిస్తున్న లలిత సునా, దుర్యోధన్ సునాలు భార్యాభర్తలు. గత కొద్ది రోజులుగా వీరిద్దరి మధ్య విబేధాలు ఉన్నాయి. బుధవారం నాడు ఇద్దరి మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో కోపోద్రిక్తుడైన దుర్యోధన తన భార్య లలిత గొంతు నులిమి దాడి చేశాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే ఆమెను జేకేపూర్‌లో గల ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించారు. కానీ అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న లలిత కుటుంబ సభ్యులు చందిలి గ్రామానికి చేరుకున్నారు. తన చెల్లెలిని తన బావ హత్య చేశాడని చందిలి పోలీస్ స్టేషన్‌లో మృతురాలి అన్నయ్య సానిబ్ నాయక్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గురువారం దుర్యోధన సునాను అదుపులోకి తీసుకున్నారు.

నదిలో పడి వృద్ధురాలి మృతి

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి బొమ్మిక గ్రామం వద్ద గల మహేంద్రతనయ నదికి గురువారం సాయంత్రం స్నానానికి వెళ్లిన వృద్ధురాలు మునిగి చనిపోయిన ఘటన జరిగింది. బృందా రౌళో (60)గా గ్రామస్తులు గుర్తించారు. మృతురాలి భర్త సహదేవ్ రౌళో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురండి పోలీసు అధికారి ఓంనారాయణ పాత్రో సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పర్లాకిమిడి ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు.

టిప్పర్ కింద నరకయాతన



బాధితుడిని బయటకు తెస్తున్న ఫైర్ సిబ్బంది



ట్రక్ కింద నలిగిపోతున్న భువనేశ్వర్ కుమార్



బోల్తా పడ్డ భారీ ట్రక్



బయటకు తీయడానికి ప్రయత్నాలు చేస్తున్న స్థానికులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి–326 పై నంగర్ పొఖాన్ గ్రామ సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో శుక్రవారం ఓ ట్రక్ బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రక్ కింద డ్రైవర్ భువనేశ్వర్ కుమార్ చిక్కుకుపోయాడు. ఈ ట్రక్ లో భారీ ఇనుప స్క్రాప్ ఉండడంతో మరింత బరువుతో ట్రక్ కిందకు వంగిపోయింది. ఆ మార్గంలో వెళ్తున్న వారు బొయిపరిగుడ పోలీసులకు సమాచారం అందజేశారు. ఇదే సమయంలో ఆ పరిధిలో ఉన్న బీఎస్ఎఫ్ క్యాంప్‌కి సమాచారం రావడంతో జవానులు ట్రక్‌కు రక్షణగా నిలిచారు. బొయిపరిగుడ నుంచి ఫైర్ స్టేషన్ సిబ్బంది చేరుకొని డ్రైవర్‌ని బయటకు తీసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. అయితే అతను బతికే ఉన్నట్లు తెలియడంతో 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న జయపూర్ అగ్ని మాపక కేంద్ర అధికారి సురేష్ బారిక్ తన సిబ్బంది అప్రమత్తం చేశారు. అత్యవసర సమయాల్లో స్పందించే క్విక్ యాక్షన్ సభ్యులతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. భారీ క్రేన్, హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా బాధితుడిని బయటకు తీసారు. ఐదు గంటలకు పైగా మృత్యువుతో పోరాడిన భువనేశ్వర్ ఎట్టకేలకు బయటకు వచ్చాడు. బాధితుడు ట్రక్ నుంచి క్షేమంగా బయటకు వస్తున్నప్పుడు ఆ ప్రాంతమంతా చప్పట్లతో దద్దరిల్లింది. అనంతరం క్షతగాత్రుడిని బొయిపరిగుడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం ఏమీ లేదని వైద్యులు ప్రకటించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఫైర్ సిబ్బందికి ప్రజల నుండి పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తాయి.



ప్రజల చప్పట్లకి ప్రతిస్పందిస్తున్న ఫైర్ సిబ్బంది

7, 8 తేదీల్లో ఏఐవైఎఫ్ సభలు



సన్నాహక సమావేశంలో పాల్గొన్న సంఘ ప్రతినిధులు

జయపురం: మే 7, 8వ తేదీల్లో కొరాపుట్ టౌన్ హాలులో జరిగే ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్(ఏఐవైఎఫ్) మహాసభలు విజయవంతం చేయాలని రాష్ట్ర విభాగ అధ్యక్షుడు ప్రదీప్ శెట్టి, రాష్ట్ర సాధారణ కార్యదర్శి సత్య రంజన్ మహంతి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్మిక భవనంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి రోజు ర్యాలీ అనంతరం సభ ప్రారంభమవుతుందని, యూత్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.అరుణ మల్లయ రామన్న (తమిళనాడు), కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పండా, ఒడిశా రాష్ట్ర కార్యదర్శి ఆశిశ్ కనుంగో, బీహార్ రాష్ట్ర యువనేత విశ్వజిత్ కుమార్ తదితరులు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ ఫెడరేషన్ రాష్ట్ర పరిషత్ సభ్యులు వికాశ ముదులి, జిల్లా నేతలు కుమార జాని, పవన్ మహురియ, అజిత్ పట్నాయక్, బుద్ర బొడొనాయిక్, ప్రమోద్ కుమార్ మహంతి, జుధిష్టర్ రౌళొ, రామకృష్ణదాస్, కామదేవ్ నాహక్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన జైన విగ్రహం అదృశ్యం



కెచ్చలలో అదృశ్యమైన జైన విగ్రహం

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కెచ్చల ప్రాంతంలో కొండ మీద ఉండే 7 పురాతన జైన విగ్రహాల్లో ఒకటి అదృశ్యమైంది. ఇది గమనించిన గిరిజనులు కొరాపుట్ సదర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. 6 శతాబ్దంలో కొరాపుట్ జిల్లాలో నందపూర్ నుంచి బి.సింగ్‌పూర్ వరకు జైన సంస్కృతి కొనసాగిందని చరిత్ర చెబుతోంది. కెచ్చల ప్రాంతంలో విగ్రహాలు కొలాడ్ రిజర్వాయర్ ప్రారంభమైనప్పుడు నీటిలో మునిగిపోయాయి. అనంతరం గిరిజనులు వాటిని తీసుకువచ్చి పూజిస్తున్నారు. అందులో పెద్ద విగ్రహం ఇప్పుడు అదృశ్యమైంది.

సమాధి పూడ్చివేత

కొరాపుట్: మత వివాదంగా మారిన సమాధి సమస్య పరిష్కారమైంది. శుక్రవారం రెండు మతాల వారు ఏకాభిప్రాయానికి వచ్చారు. నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కుమిలి గ్రామ పంచాయతీ మాల్చెడ గ్రామంలో మతం మార్చుకున్నందుకు అంత్య క్రియల విషయంలో వివాదం రేగిన విషయం పాఠకులకు విధితమే. సొంత పొలంలో పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసేందుకు కూడా ప్రయత్నించారు. తాజాగా ప్రస్తుత ఒప్పంద ప్రకారం తిరిగి హిందూ మతానికి రావడానికి బాధిత కుటుంబం అంగీకరించింది. దాంతో ఇరు వర్గాలు రాజీ పడ్డాయి. సగం మట్టి తీసిన సమాధిని తిరిగి మట్టి పోసి కప్పారు.

భువనేశ్వర్, కటక్‌పై కాల వైశాఖి ప్రభావం



భువనేశ్వర్‌లో రోడ్డు పై కూలిన వృక్షాలు



వృక్షాలను తొలగిస్తున్న సహాయక బృందాలు

కొరాపుట్: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌తో పాటు జంట పట్టణమైన కటక్‌పై కాల వైశాఖి విజృంభించింది. శుక్రవారం ఉదయం తీవ్రమైన ఉరుములు, మెరుపులతో గాలులు వీచి భారీ వర్షం పడింది. దాంతో కొద్ది గంటల పాటు జనజీవనం అల్లాడిపోయింది. అనేక ప్రాంతాల్లో చెట్లు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఉదయమే ఈ ప్రళయం చూసి ప్రజలు భయకంపితులయ్యారు.వెను వెంటనే ఒడ్రాఫ్,అగ్ని మాపక బృందాలు రంగంలోనికి దిగి చెట్లని తొలగించాయి. విద్యుత్ శాఖ సిబ్బంది వర్షంలోనే విద్యుత్ పునరుద్ధరించారు. బలంగీర్, డెంకనాల్, నబరంగ్‌పూర్ జిల్లాలలో కాల వైశాఖి ప్రభావంతో భారీ వర్షాలు పడ్డాయి.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ప్రమాదంలో గాయాలపాలైన నలుగురు వ్యక్తులు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయాలపాలయ్యారు. జిల్లాలోని చంద్రపూర్ సమితి ఖిలాపాడియా వద్ద శుక్రవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చంద్రపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కొసం వారిని బరంపురం తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. చంద్రపూర్ సమితి బిజాపూర్ పంచాయతీలోని ఖిలుండి గ్రామానికి చెందిన మిలి పావుగండ, శ్వేతా పావుగండలు బైకుపై మునిగుడ వైపు వెళుతున్నారు. ఇదే సమయంలో కుట్రాగుడ నుంచి చంద్రపూర్ వైపు బైకులో వెళ్తున్న కిరణ్ మలిబిసాయి, తిక్లొ బెహరాలు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైకును బలంగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రగాయాలకు గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సామూహిక ఉపనయనాలకు శ్రీకారం



జంఝూవతి నదిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక ఉపనయనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న ఈ ఉపనయనాలు ఆదివారం వరకు కొనసాగుతాయని సంఘం అధ్యక్షుడు బాబా ప్రసాద్ తెలిపారు. ముందుగా జంఝూవతి నదీ తీరంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉపయనయనాల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

అద్దె తగ్గింపునకు అంగీకారం



అధికారులతో చర్చలు జరుపుతున్న చాంబర్ ప్రతినిధులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో మున్సిపల్ స్టాల్స్ అద్దెలు తగ్గించడానికి కౌన్సిల్ అంగీకరించింది. శుక్రవారం చాంబర్ ఆఫ్ కామర్స్ నేతృత్వంలో వ్యాపారుల బృందం కౌన్సిల్‌కి తరలివెళ్లి విజ్ఞప్తులు చేయగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గతంలో స్టాల్‌కు రు.840 వరకు అద్దె ఉండేది. పొడవు, వెడల్పులకు సంబంధం లేకుండా ఈ అద్దె వసూలు చేసేవారు. ఇది అసమంజసంగా భావించి చదరపు అడుగుకు రూ.9 చొప్పున అద్దె వసూలు చేయాలని కౌన్సిల్ నిర్ణయం చేసింది. దాంతో వ్యాపారులు ఈ అద్దె భారం అవుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ కునునాయక్‌తో చర్చలు జరపగా ఇకపై చదరపు అడుగుకు రు.7గా నిర్ణయించారు. సమావేశంలో చాంబర్ అధ్యక్షుడు కనుదాస్, టి.ఎల్.మూర్తి, ఈఓ సమ్రేష్ మహంతి, కౌన్సిలర్ ఏ.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు శిక్షణ శిబిరం



మైనారిటీ వ్యవహారాల మంత్రి నిత్యానంద గొండోకి వినతి పత్రం ఇస్తున్న ముస్లిం మత పెద్దలు



జయపూర్ ముస్లిం అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మీర్జా ముస్తాఫా బేగ్

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో తొలిసారిగా హజ్ యాత్రికుల శిక్షణ శిబిరం జరగనుంది. శుక్రవారం జయపూర్ ముస్లిం అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మీర్జా ముస్తాఫా బేగ్ ఈ వివరాలు ప్రకటించారు. ఈ నెల 22వ తేదీన జయపూర్ పట్టణం లోని సంధ్యా ఫంక్షన్ హాల్‌లో ఈ శిబిరం ప్రారంభిస్తామన్నారు. అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి మెత్తం 41 మంది ఈ ఏడాది హజ్ యాత్రకి వెళ్తున్నారని తెలిపారు. అందులో నబరంగ్‌పూర్ జిల్లా నుంచి 11 మంది, కొరాపుట్ జిల్లా నుంచి 21 మంది, రాయగడ జిల్లా నుంచి ఆరుగురు, మల్కన్ గిరి జిల్లా నుండి ముగ్గురు ఉన్నారని తెలిపారు. వీరు మే 13న హజ్ బయల్దేరి 42 రోజులు యాత్ర చేస్తారని తెలిపారు. ఒడిశా బోర్డు ఆఫ్ వక్ఫ్ కటక్ నుంచి నలుగురు నిపుణులు వచ్చి యాత్రికులకు శిక్షణ ఇస్తారన్నారు. యాత్రలో గుర్తింపు కార్డుల రక్షించుకోవడం, ప్రార్థన స్థలాలు కేటాయించిన భవనాల వద్దకు చేరుకోవడం, సౌదీలో నియమాలు గురించి యాత్రికులకు శిక్షణ ఇస్తారని ముస్తఫా పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



మోహన పురవీధుల్లో శిలువను పట్టుకుని యాత్ర జరుపుతున్న క్రైస్తవులు



గుడ్ ఫ్రైడే సందర్భంగా మోహనలో శిలువను పట్టుకుని శోభాయాత్రలో క్రైస్తవులు



చర్చ్‌లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



ప్రార్థనలో పాల్గొన్న మహిళలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనలో గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి. మోహన ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి సెయింట్ పీటర్స్ చర్చి వరకూ శిలువను పట్టుకుని క్రిస్టియన్లు శోభ యాత్ర జరిపారు. ఈ శోభాయాత్రలో ఫాదర్ ఇసాక్ నాయక్‌తో పాటు అనేక మంది పాల్గొన్నారు. జిల్లాలోని పిండికి, బోడోపద, గుమ్మా, పర్లాకిమిడిలో పురుషోత్తం బాప్టిస్టు చర్చి, రామన్ కాథలిక్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

జయపురంలో..

జయపురం: జయపురంలో జేఈఎల్‌జీ చర్చ్‌లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు జరిగాయి. ఏసుక్రీస్తును శిలువ వేసిన దినంగా గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటామని ఫాదర్ తెలిపారు.

న్యూస్‌రీల్

కనువిందు చేస్తున్న చెంగల్వ పూలు


ఆకర్షణీయంగా ఉన్న చెంగల్వ పూలు

ఎల్ఎన్ పేట: మండలంలోని మురగడలోవ గిరిజన గ్రామంలో ఈ ఏడాది ముందే పూతకు వచ్చిన చెంగల్వ పూలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఏటా మే నెలలో పూతకు వచ్చే చెంగల్వ పూలు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే విరబూశాయి. అరుదుగా కనిపించే చెంగల్వ పూల మొక్కకు చెందిన దుంపలు భూమిలో ఉంటాయి. దుంప నుంచి కాడలా పెరిగిన మొక్క ఒక్కో కాడ నుంచి అనేక పూలు పూస్తుందని గిరిజనులు సవర చిరంజీవి, సవర సింహాచలం తెలిపారు.

ప్రాచీన వారసత్వ సంపదను కాపాడుకుందాం


పురాతన బావి వద్ద ఇంటాక్ బృంద సభ్యులు

గార: ప్రాచీన వారసత్వ సంపదలను కాపాడుకుందామని ఇంటాక్ బృందం కన్వీనర్ నూక సన్యాసిరావు, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హెరిటేజ్ వాక్ పేరిట మండలంలోని నిజామాబాద్ గ్రామంలో పర్యటించారు. షేర్ మహమ్మద్ ఖాన్ పాలనా కాలంలో అతిపెద్ద మెట్ల బావి నిర్మాణం చేశారన్నారు. గ్రామస్తులతో అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. 25 ఏళ్ల కిందటి వరకు ఈ బావి నీరు తాగడానికి వాడేవారమని గ్రామస్తులు తెలి పారు. అప్పట్లో నిర్మించిన పురాతన భవనాలు కూడా ఇప్పటికీ చెక్కుచెదురుకుండా ఉండటాన్ని గుర్తించారు. ఈ భవనాలను, బావిని పర్యాటక కేంద్రంగా మలచడానికి అవకాశం ఉందని బృంద సభ్యులు అభిప్రాయపడ్డారు. పరిశీలనలో ఇంటాక్ మెంబర్లు కొమ్ము రమణమూర్తి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్, తర్లాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీలర్ కుటుంబంపై దాడి చేసిన వారిపై కేసు నమోదు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ రమణమ్మ కుటుంబంపై దాడి చేసిన వారిపై శుక్రవారం లావేరు పోలీసులు కేసు నమోదుచేశారు. డీలర్ రమణమ్మ రిమ్స్‌లో ఎంఎల్‌సీకు ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోర పారోతి, పరపతి రాము, రమణమ్మ, గాలి రమణ, బోర అసిరినాయుడు, వాకాడ గణేష్, బోర గణేష్, దుర్గారావు, హరీష్‌లపై కేసు నమోదు చేశారు.

పిడుగుపాటుకు విద్యుత్ ఉపకరణాలు ధ్వంసం

కంచిలి: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పిడుగులతో కూడిన వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ ఉపకరణాలు ధ్వంసమయ్యాయి. మండలంలోని గోకర్ణపురం పంచాయతీ పరిధి గోకర్ణపురం, జె.నారాయణపురం గ్రామాల సమీపంలో పడిన పిడుగుల ధాటికి పలు ఇళ్లల్లో విద్యుత్ ఉపకరణాలు పాడయ్యాయి. జె.నారాయణపురం గ్రామానికి చెందిన శ్రీ సిద్ధభైరవి కేబుల్ నెట్‌వర్క్ పరిధిలో ఆపరేటింగ్ సిస్టంలో ట్రాన్స్‌మీటర్, సెటాఫ్ బాక్సులు, ఎల్ఈటీ టీవీ తదితర పరికరాలు పాడయ్యాయని యజమాని రత్నాల డొంబురు తెలిపారు. గ్రామంలో రత్నాల గురునాథం, సీర దమయంతి, సీర పార్వతి, యారడి దీనబంధు, డి.హిమావతి తదితరుల ఇళ్లల్లో సెటాఫ్ బాక్సులతోపాటు విద్యుత్ ఉపకరణాలు పిడుగుపాటుకు కాలిపోయాయి.

పిడుగు పాటుకు మూగజీవి మృత్యువాత

వజ్రపుకొత్తూరు రూరల్: మండలం గరుడబద్ర పంచాయతీ పరిధిలోని గల మర్రిపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిడుగు పడి ఆవు మృత్యువాత పడింది.

డ్రైనేజీలా.. డంపింగ్ యార్డులా?


దోలాట్యాంకు రోడ్డులో డ్రైనేజి నుంచి బయటపడిన ప్లాస్టిక్ వ్యర్థాలు


మున్సిపల్ డ్రైనేజీల్లో ప్రజా ఆరోగ్యశాఖ మంచి నీటి పైపులు


నాలాల్లో పేరుకుపోయిన చెత్త

పర్లాకిమిడి పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో చెత్తను సేకరించడానికి వాహనాలు ఉదయం పూట ప్రతి వార్డులో తిరుగుతుంటాయి. ప్రజలు నెలనెలా యూజర్ చార్జీలు చెల్లిస్తారు. అయితే కొందరు వాహనాల్లో చెత్త వేయకుండా డ్రైనేజీల్లో చెత్త, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ పడవేయడంతో పురపాలక సిబ్బందికి తలనొప్పిగా మారింది. ఇటీవల వర్షం పడిన సమయంలో కాలువలు పూడికతో నిండటంతో డ్రైనేజీ నీరు రోడ్డు పైకి వచ్చింది. ఇప్పటికైనా పౌరులు బాధ్యతగా వ్యవహరిస్తూ చెత్తను కాలువల్లో పడేయకుండా సంబంధిత వాహనాలకు అందజేయాలని సిబ్బంది కోరుతున్నారు.

– పర్లాకిమిడి

గవర్నమెంట్ డీఏవీ కాలేజ్‌గా పేరు మార్పు


మాట్లాడుతున్న కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో


కొరాపుట్‌లోని ప్రభుత్వ డీఏవీ కళాశాల

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ కాలేజీని మరలా గవర్నమెంట్ డీఏవీ కాలేజీగా పేరు మారుస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ట్రైబుల్ మ్యూజియంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురాం మచ్చో మాట్లాడుతూ 1967లో దయానంద ఆంగ్లో వేదిక్ (డీఏవీ) ద్వారా ఈ కళాశాల ఏర్పాటైందన్నారు. 13 ఏళ్ల క్రితం ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లి గవర్నమెంట్ కాలేజీగా మారిందని గుర్తు చేశారు. నాటి నుంచి పూర్వ విద్యార్థులు అనేక పోరాటాల ద్వారా పేరు మార్పు కోసం ప్రయత్నాలు చేశారని పేర్కొన్నారు. ఉన్నత విద్యాశాఖమంత్రి సూరజ్ సూర్యవంశీకి వినతిపత్రాలు అందజేశారని గుర్తు చేశారు. తాను సైతం ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించడంతో ఎట్టకేలకు పాత పేరు వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఏవీ పూర్వ విద్యార్థులు, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్‌ను సందర్శించిన సీఎల్‌పీ నేత


అంపావలి వద్ద సొరంగంలో రాంచంద్ర ఖడం

కొరాపుట్: భారత్‌మాల సొరంగ మార్గాన్ని(టన్నెల్) కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు రాంచంద్ర ఖడం శుక్రవారం సందర్శించారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి సుంకీ సమీపంలోని అంపావల్లి గ్రామం వద్ద సొరంగ మార్గంలోనికి అనుచరులతో కలిసి ప్రవేశించారు. నిర్మాణ వ్యవహారాలను కేంద్ర ప్రభుత్వ నిపుణులను అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.20 వేల కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కి ఆరు అంచెల ఎకనామిక్ కారిడర్(భారతమాల జాతీయ రహదారి) నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.

లోయలో పడిన లారీ

- డ్రైవర్, క్లినర్‌కు గాయాలు


తప్తపాణి ఘాటి వద్ద బోల్తాపడిన లారీ

పర్లాకిమిడి: గజపతి–గంజాం జిల్లాల సరిహద్దు తప్తపాణి ఘాటి వద్ద రాయగడ నుంచి బరంపురం వెళ్తున్న 16 చక్రాల లారీ (ట్రక్కు) అదుపుతప్పి 20 అడుగుల లోయలో పడిపోయిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పేపరు లోడుతో ఉన్న లారీ అదుపు తప్పి తప్తపాణిఘాటి జకరపల్లి వద్ద బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లినర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పుడామర్రి పోలీసు థానా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. గతంలో పలు సార్లు ఇదే ఘాటి మలుపు వద్ద ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

జాతీయ సెమినార్ ప్రారంభం



వేదికపై వైస్ చాన్సలర్, అతిథులు

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వద్యాలయంలో సైన్స్ ఫర్ సోషియేటెడ్ అప్లికేషన్స్ అనే అంశంపై శుక్రవారం రెండు రోజుల జాతీయ సెమినార్ ప్రారంభమయ్యింది. వర్సిటీ ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగం ఐటీపీ, ఐఎఎన్‌సీఎఎస్,–ఈఆర్‌సీ భువనేశ్వర్ సహకారంతో జరిగిన ఈ సదస్సులో కార్యదర్శి డాక్టర్ బి.మల్లిక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఈఆర్‌సీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె.కె. నంద, ముంబై బీఆర్‌సీ డాక్టర్ ఆర్.ఆచార్య విశ్వవిద్యాలయ పి.జి కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌కుమార్ పాత్ర, యూనివర్శిటీ రిజిస్ట్రార్ మహేశ్వర చంద్రనాయిక్, యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దేవీప్రసాద్ మిశ్రా, సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్ఞాన రంజన్ మహంతి, హెచ్ఓడీ డాక్టర్ సుజిత్ కుమార్ దెహురి, సెమినార్ కన్వీనర్ డాక్టర్ బీబీ నంద, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల కోసం రాజీలేని పోరాటం


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న విద్యార్థినులు

కొరాపుట్: రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. శుక్రవారం కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితి కత్రగుడ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వేధింపులకు నిరసనగా కొన్నాళ్లుగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇకపై కూడా మహిళలు, రైతుల తరఫున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 80 శాతం మంది రైతులే ఉన్నారని, వారి సమస్యల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈ నెల 22 నుంచి రంగు మార్చి కొత్త రేషన్ కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

జలయజ్ఞ శోభ



మున్సిపాలిటీ పరిధి బెల్లుపడలో శ్రీరామతారక మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞం కోసం శుక్రవారం జలయజ్ఞ శోభాయాత్ర ఘనంగా సాగింది. బాహుదా నుంచి నుంచి పవిత్ర జలాలను మహిళలు తీసుకువచ్చారు. జలయాత్రలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– ఇచ్ఛాపురం టౌన్

మన గణేశుడు సాధించాడు


రికార్డును సాధించిన అనంతరం జాతీయ పతాకంతో గణేష్

- డొంకలపర్త వాసి అరుదైన రికార్డు
- సముద్రంలో 28 కిలోమీటర్ల దూరాన్ని 10.30 గంటల్లో ఈదిన వైనం
- తెలుగు రాష్ట్రాల నుంచి పారా స్విమ్మర్‌గా చారిత్రాత్మక ఘనత


సముద్రంలో ఈదుతూ..

ఏలూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్విమ్మింగ్ కోచ్‌గా పనిచేస్తున్న బూర్జ మండలం డొంకలపర్త గ్రామానికి చెందిన బలగ గణేష్ రాష్ట్రంలో తొలి పారా స్విమ్మర్‌గా చరిత్ర సృష్టించారు. శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి భారతదేశంలో ధనుష్కోటి వరకు 28 కిలోమీటర్ల దూరాన్ని పది గంటల 30 నిమిషాల్లో ఈది తెలుగు రాష్ట్రాల నుంచి తొలి పారా స్విమ్మర్‌గా నిలిచారు. శుక్రవారం ఉదయం 5.50కు ప్రారంభించిన ఈ ప్రయాణాన్ని సాయంత్రం 4.20 గంటలకు పూర్తి చేశారు. ఈ అసాధారణ రికార్డుపై స్పోర్ట్స్ అథారిటీ అసోసియేషన్ ప్రతినిధులు, శాప్ ఎండీ గిరీశ పీఎస్, డొంకలపర్త గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి బాలుడు బలి


విలపిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

కొరాపుట్:

విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి ఓ బాలుడు బలైపోయాడు. శుక్రవారం కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితి కనేజువా గ్రామ సరిహద్దులో జీడి తోటలో విద్యుత్ వైరు తగిలి కైలాష్ గదవ (10) అనే బాలుడు మృతి చెందాడు. ఈ ప్రాంతంలో విద్యుత్ వైరు తెగినప్పటికీ కరెంట్ ప్రవహిస్తుందని గిరిజనులు విద్యుత్ శాఖకి ఫిర్యాదు చేశారు. కానీ మూడు రోజులుగా పట్టించుకోలేదు. జీడి తోటలో పిక్కలు ఏరుకోవడానికి బాలుడు వెళ్లగా విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొరాపుట్ కలెక్టర్‌కు ప్రధాన మంత్రి ఎక్స్‌లెన్స్ అవార్డు


కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్


కేంద్ర ప్రభుత్వం పంపిన ఆహ్వానం

కొరాపుట్: ప్రధాన మంత్రి అవార్డు ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తివాసన్ ఎంపికయ్యారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఈ వివరాలు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా 11 కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చడంలో జిల్లా యంత్రాంగం ముందుంది. దీనిపై కేంద్ర అధికారులు వచ్చి దర్యాప్తు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 21న న్యూఢిల్లీలో ప్రధాని ఈ అవార్డు అందజేయనున్నారు.

పది మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు


పోటీకు హాజరైన ఉపాధ్యాయులతో అతిథులు


కలెక్టర్ చేతులమీదుగా రూ.10 వేలు చెక్ అందుకుంటున్న ఉత్తమ ఉపాధ్యాయురాలు వి.సంతోషి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలోని ఏడు సమితుల్లో పనిచేస్తున్న పది మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఈ అవార్డులను వారికి అందజేశారు. వి.సంతోషి, సస్మితా పండ, బాబుల్ రంజాన్ సాహు, సప్రభ విశ్వాల్, శావానీ నాయక్, సుజాతా రాణి, రంజాన్ దాస్, ప్రసాంత్ కుమార్ సాహు మత్తిలిలకు అవార్డులు లభించాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధన్, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, ఇతర అతిథులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ నీలకంఠేశ్వర ఆలయ ప్రతిష్టాపనోత్సవం


ప్రతిష్టా మహోత్సవంలో జెడ్పీ అధ్యక్షులు గవర తిరుపతిరావు


కురిగాంలోని గౌరీ నీలకంఠేశ్వర స్వామి ఆలయం


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి మిల్లు కురిగాం గ్రామంలో శుక్రవారం గౌరీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ధర్మకర్తలు, జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, ప్రమీలా దేవి దంపతులు ఆధ్వర్యంలో స్వామి లింగప్రతిష్ఠ, అగ్నిహోత్రం, అన్నదాన ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, బీజేడీ జిల్లా అధ్యక్షులు ప్రదీప్ నాయక్, కాశీనగర్ ఎన్ఏసీ చైర్మన్ మేడిబోయిన సుధారాణి, మధు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఒకే సారి నాలుగు కొలువులు

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన గోకర్ల రాహుల్ నాలుగు కొలువులు సాధించి ఔరా అనిపించాడు. జనవరిలో ఆర్ఆర్‌బీ క్లర్క్‌గా, ఏప్రిల్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా పీఓగా, బ్యాంక్ ఆఫ్ బరోడా క్లర్క్‌గా, యూనియన్ బ్యాంక్ ఎల్‌పీఓగా కొలువులు సాధించాడు. తండ్రి బాలరాజు, తల్లి పద్మావతి. తండ్రి కిడ్నీవ్యాధితో బాధ పడుతున్నారు. తల్లి టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. విద్యార్థి ఇంటర్ విశాఖలోని నారాయణ కాలేజీలో, తర్వాత ఇంజినీరింగ్ గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో చదివాడు.

'విలీనం ఆలోచన విరమించుకోవాలి'

శ్రీకాకుళం: హైస్కూల్‌లో ప్రాథమిక తరగతుల విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షులు బి.రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ప్రభుత్వ నిర్వాహకముందని ఆవేదన వ్యక్తం చేశారు. హైస్కూల్స్‌లో ప్రాథమిక తరగతులకు 10 మంది పిల్లలుంటే రెండు ఎస్జీటీలు, 11 నుంచి 30 మంది ఉంటే మూడు ఎస్జీటీలు, 45కి పైగా విద్యార్థులుంటే 4 ఎస్జీటీ, పాఠశాలలో 20 మంది ఉంటే ఒక టీచర్ అంటూ ఉపాధ్యాయుల సర్దుబాటులో వివక్షను కూడా తొలగిస్తూ అందరూ విద్యార్థులకు ఒకే రకమైన న్యాయం చేకూర్చాలని ఆ ప్రకటనలో కోరారు.

క్లుప్తంగా

కొబ్బరిబొండాల వ్యాన్ బోల్తా



బోల్తాపడిన వ్యాన్

సీతానగరం: మండలంలోని అంటిపేట వద్ద కొబ్బరి బొండాల వ్యాన్ బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. దీనిపై అంటిపేట గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలంలోని అంటిపేట మీదుగా పార్వతీపురం వెళ్తున్న కొబ్బరిబొండాల వ్యాన్ అంటిపేట గ్రామ శివారులో వ్యక్తిని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న పొలంగోతిలో పడింది. వ్యాన్ డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. వ్యాన్ ముందు వీల్స్ మట్టిలో కూరుకుపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు చెబుతున్నారు.

జేసీబీ, 3 ట్రాక్టర్లు సీజ్



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్లు

బొండపల్లి: మండలంలోని వెదురువాడ పంచాయతీ పరిధి పాడిపేట గ్రామ సమీపంలో అక్రమంగా గ్రావెల్ మట్టిని తవ్వి వెదురువాడలోని జిరాయితీ భూమిలో వేస్తుండగా అందిన ఫిర్యాదు మేరకు 1 జేసీబీతో పాటు, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా జేసీబీ డ్రైవర్ శీల గణేష్‌తో పాటు తాడి పైడినాయుడు, శీల శ్రీను, యడ్ల గోపిలు గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్ చేసి రూ.25 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. సీజ్ చేసిన వాహనాలను బొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్సై యు.మహేషకు అప్పగించినట్లు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం జిల్లా గనుల శాఖ ఎ.డికి నివేదిక అందజేసినట్లు తెలిపారు.


పిడుగుపాటుతో ఆవు మృతి



ఆవు కళేబరం

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం కురిసిన పిడుగుల వర్షంతో పిడుగుపాటుకు గురై గ్రామానికి చెందిన హరిశ్రీను ఆవు మృతి చెందింది. పొలంలో మేత మేస్తుండగా అకస్మాత్తుగా గాలి వర్షంతో పాటు పిడుగులు పడడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన విషయంలో గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కమిషన్ కృషి



వినతిపత్రం అందుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఎస్టీ కమిషన్ కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. షెడ్యూల్ ప్రాంతాల్లో భూములపై గిరిజనులకే హక్కులు దక్కేలా చర్యలు తీసుకోవాలని ట్రైబల్ డెవలప్‌మెంట్ మిషన్ సంస్థ ప్రతినిధులు పలువురు శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం చేసిన చట్టాలు అమలయ్యేలా చూడాలని వారు కోరారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన భూసమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విస్తృత పర్యటన చేస్తూ వారి సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కమిషన్ కృషి చేస్తోందన్నారు. గిరిజన ప్రాంతవాసుల సమస్యలు కమిషన్ దృష్టిలో ఉన్నాయని సంబంధిత చట్టాలు అమలు చేసేలా ప్రభుత్వాన్ని కమిషన్ కోరుతున్నట్లు చెప్పారు. చైర్మన్‌ను కలిసిన వారిలో అజయ్‌కుమార్, తిరుమల రావు, గోపాలరావు, చంద్రరావు తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని గెడ్డతిరువాడ గ్రామ సమీపాన గత మూడు రోజులుగా కొందరు యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలను జరిపిస్తున్నారు. తమ వ్యాపారానికైనా వ్యక్తిగత అవసరాలకైనా మట్టి తవ్వకాలను జరిపేటప్పుడు స్థానిక తహసీల్దార్‌కు తెలియజేసి ఆయన అనుమతితో తవ్వకాలను జరిపించాల్సి ఉంది. అయితే వీరు ఎవరి అనుమతి లేకుండా వందల ట్రాక్టర్ల మట్టి లోడ్లను తరలిస్తున్నారు. అక్రమ తవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పడిపోతున్న ప్లేట్‌లెట్స్..!

- సాధారణ జ్వరపీడితులకూ గుబులు
- ప్లేట్‌లెట్స్ సాధారణ స్థితి1.50లక్షల నుంచి 4.75 లక్షలు
- బ్లడ్‌బ్యాంక్‌లను ఆశ్రయిస్తున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: పి.శ్రీను అనే వ్యక్తి జ్వరంతో బాధపడుతూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అతనికి వైద్య పరీక్షలు చేయగా మలేరియా జ్వరం అని నిర్ధారణ అయింది. ప్లేట్ లెట్స్ 30 వేలకు తగ్గిపోయాయి. దీంతో వైద్యులు బిపాజిటివ్ ప్లేట్ లెట్స్ ఎక్కించాలని చెప్పడంతో ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌ను ఆశ్రయించగా మూడు యూనిట్లు ప్లేట్‌లెట్స్ ప్యాకెట్లు అందించారు.

☛ కె.ఆదినారాయణ అనే వ్యక్తి జ్వరంతో సర్వజన ఆస్పత్రిలో చేరగా వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. వైద్య పరీక్షల్లో ప్లేట్‌లెట్స్ కౌంట్ 20 వేలకు తగ్గింది. దీంతో వైద్యుడు ఒ పాజిటివ్ గ్రూప్ ప్లేట్‌లెట్స్ నాలుగు యూనిట్స్ ఎక్కించాలని చెప్పగా బంధువులు ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్ సిబ్బందిని ఆశ్రయించి నాలుగు యూనిట్స్ ప్లేట్‌లెట్స్ ప్యాకెట్స్ ఇచ్చారు.

☛ భాస్కరరావు అనే మరో వ్యక్తి జ్వరంతో బాధపడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరగా వైద్య పరీక్షల అనంతరం మలేరియాగా నిర్ధారణ అయింది. ప్లేట్‌లెట్ కౌంట్ 4 వేలకు పడిపోయింది. దీంతో వైద్యులు ఒ పాజిటివ్ గ్రూప్ ప్లేట్‌లెట్స్ ప్యాకెట్స్ నాలుగు ఎక్కించాలని చెప్పగా సర్వజన ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బందిని ఆశ్రయించగా నాలుగు యూనిట్స్ ప్లేట్ లెట్స్ ప్యాకెట్లు అందించారు.

వీరు ముగ్గురే కాదు. జ్వరాల బారిన పడిన అనేక మందికి ప్లేట్ లెట్స్ కౌంట్ తగ్గిపోతోంది. దీంతో ప్లేట్‌లెట్స్ కోసం వారి బంధువులు బ్లడ్ బ్యాంక్‌లను ఆశ్రయిస్తున్నారు. గతంలో డెంగీ జ్వరం వస్తే ప్లేట్‌లెట్స్ తగ్గిపోయేవి. కానీ ఇప్పుడు సాధారణ జ్వరాలకు కూడా ప్లేట్‌లెట్స్ తగ్గిపోతున్నాయి. దీంతో రోగులు ఆందోళన చెందుతున్నారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



ప్లేట్‌లెట్స్

జ్వరాల వ్యాప్తి ఆరంభం

సాధారణంగా జ్వరాల వ్యాప్తి జూన్‌నెలలో ఎక్కువగా ఉంటుంది. అయితే ప్రస్తుతం జ్వరాల వ్యాప్తి ప్రారంభమైంది. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు, ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ జ్వర పీడితులు చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రితో పాటు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు జ్వర పీడితులు వస్తున్నారు. వారిలో కొంతమంది ఓపీ విభాగంలో చికిత్స చేయించుకుని వెళ్లిపోగా, కొంతమంది ఇన్ పేషెంట్లుగా ఆస్పత్రుల్లో చేరుతున్నారు. చిన్న పిల్లలు కూడా ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు.

నెలకు 150 నుంచి 200 మందికి ప్లేట్‌లెట్స్ వినియోగం

జిల్లా వ్యాప్తంగా అనేక మందికి ప్లేట్‌లెట్స్ అవసరం అవుతున్నాయి. నెలకు 150 నుంచి 200 మందికి ప్లేట్‌లెట్స్ వినియోగిస్తున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయిన రోగులకు వాటిని అందించడం కోసం రోగిబంధువులు బ్లడ్ బ్యాంక్‌లను ఆశ్రయిస్తున్నారు. ప్లేట్‌లెట్స్ సకాలంలో ఎక్కించకపోతే ప్రాణాల మీదకు వస్తుందని వైద్యులు చెప్పిన వెంటనే రోగి బంధువులు ప్లేట్‌లెట్స్ తెచ్చి వైద్యసిబ్బందితో రోగులకు ఎక్కిస్తున్నారు.

బ్లడ్ బ్యాంక్‌ల వివరాలు:

జిల్లాలో ప్లేట్‌లెట్స్ లభ్యమయ్యే బ్లడ్‌బ్యాంకులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ , న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్, ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంక్‌లలో ప్లేట్‌లెట్స్ అందిస్తారు.

అవసరమైన వారికి అందజేత

డెంగీ జ్వరంతో పాటు వైరల్ జ్వరం వచ్చిన వారికి ప్లేట్‌లెట్స్ తగ్గుతుంటాయి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌కు ప్లేట్‌లెట్స్ కోసం వచ్చిన వారికి అందజేస్తున్నాం.

డాక్టర్ ఎస్.అప్పలనాయుడు,
సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

రేగిడి హెచ్‌ఎం సస్పెన్షన్

- డిప్యూటీ మేట్రిన్‌కు షోకాజ్ నోటీసులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలంలోని రేగిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడినిసస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీచేసినట్టు గుమ్మలక్ష్మీపురం సహాయ గిరిజన సంక్షేమ అధికారి బి.సురేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఓ విద్యార్థినిని హెచ్‌ఎం ప్రభుత్వ ఆస్పత్రికి కాకుండా కురుపాంలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించిన సంగతి తెలిసిందే. ఆశ్రమ పాఠశాల ఎదురుగా ఉన్న పీహెచ్‌సీకి కాకుండా ప్రైవేటు క్లినిక్‌కు తీసుకెళ్లడంపై గిరిజన సంఘాల నాయకులు అనుమానం వ్యక్తంచేశారు. దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ పీఓలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నెల 21న ఇదే అంశంపై కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించేందుకు గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంఘం, అఖిల భారత యువజన సమాఖ్య, ట్రైబల్ రైట్స్ ఫోరం, ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టిన కలెక్టర్ గురువారం రాత్రి రేగిడి పాఠశాల హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులతో పాటు, ఆ పాఠశాల డిప్యూటీ వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఏటీడబ్ల్యూఓ తెలిపారు.

గేదె పొడిచి వ్యక్తి మృతి



సన్యాసిరావు మృతదేహం

గంట్యాడ: మండలంలోని బోనంగి గ్రామానికి చెందిన ఆకలి సన్యాసిరావు అనే వ్యక్తి గేదె పొడవడంతో మృతి చెందాడు. సన్యాసిరావు రెండు రోజుల క్రితం తన గేదెలను మేపుకుని తిరిగి తీసుకువచ్చి కళ్లంలో కడుతుండగా ఒక గేదె తలతో పొడవగా వెనక్కి పడిపోయాడు. దీంతో తలకు గాయం కాగా కేజీహెచ్‌కు తసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుని భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

పార్వతీపురం రూరల్: ప్రేమ విఫలమవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన అల్లాడ తరుణ్(25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పట్టణ ఎస్సై గోవింద శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వైకేఎం కాలనీలో నివాసం ఉంటున్న అల్లాడ తరుణ్ తాను ప్రేమించిన అమ్మాయి కాదనడంతో మనస్తాపం చెందిన గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో గత నెల 24న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు పార్వతీపురం వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తేనెటీగల దాడిలో పంపు ఆపరేటర్‌కు గాయాలు

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న దిబ్బ శ్రీనివాసరావుపై తేనెటీగలు దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం ఉదయం మేజరు పంచాయతీలోని నీళ్ల ట్యాంకు వద్దకు వెళ్లి పంచాయతీలో కుళాయి పాయింట్లుకు రక్షిత మంచినీటిని విడిచిపెట్టేందుకు వాల్వ్ తిప్పాడు. ఇంతలో పక్కనే ఉన్న తేనె పట్టులో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా వచ్చి శ్రీనివాసరావుపై దాడి చేశాయి. వెంటనే అక్కడి నుంచి శ్రీనివాసరావు పరుగులు తీశాడు. వీరఘట్టం పీహెచ్‌సీలో వైద్య చికిత్సలు అందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఈఓ కోటీశ్వరరావు తెలిపారు.

స్వచ్ఛంద భూదానోద్యమం రావాలి

- ఆచార్య వినోబా భావేకు లోకసత్తా ఘనంగా నివాళి



ఆచార్య వినోబా భావేకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో స్వచ్ఛంద భూదానోద్యమానికి రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవా సంస్థలు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో స్వచ్ఛంద భూదాన ఉద్యమం సృష్టికర్త స్వాతంత్ర్య సమరయోధుడు, ఆచార్య వినోబా భావే చేపట్టిన భూదాన ఉద్యమం 75ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వినోబాభావే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ.. వినోబా భావే పాదయాత్ర చేస్తూ..1951 ఏప్రిల్ 18న తెలంగాణలోని పోచంపల్లిలో స్వచ్ఛంద భూదాన్ ఉద్యమానికి శ్రీకారం చుట్టి అక్కడ జమీందారు వెదిరే రామచంద్రారెడ్డి మనసును గెలిచి వంద ఎకరాల భూమిని దానంగా స్వీకరించారన్నారు. తెలంగాణలో 1.30లక్షల ఎకరాలు, ఆంధ్రాలో 80 వేల ఎకరాలు వినోబా భావే సేకరించినవి ఉన్నాయని, ఉమ్మడి రాష్ట్రంలో సుమారు రెండు లక్షల యాభై ఎకరాలు పేద ప్రజలకు దాదాపు 50లక్షల ఎకరాల భూమిని దానంగా స్వీకరించి 1965లో అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో భూదాన్ గ్రామ్‌దాన్ చట్టం వచ్చేలా చేశారని కొనియాడారు. తన తాత స్వాతంత్ర్య సమరయోధుడు, స్వర్గీయ భీశెట్టి అప్పారావు అనకాపల్లి శాసనసభ్యుడిగా వినోబా భావే స్ఫూర్తితో స్వచ్ఛంద భూదాన్ ఉద్యమంలో పాల్గొని పేదలకు భూములు పంచారని భీశెట్టి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, ధాత్రాజు రాజారావు, బోరరమేష్, పౌరవేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్ర రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



సారా స్థావరం వద్ద స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ టబ్బులను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం)/జియ్యమ్మవలస రూరల్: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కురుపాం ప్రొహిబిషన్/ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జియ్యమ్మవలస మండలం గడసింగుపురం గ్రామపరిసరాల్లో సారా తయారీ స్థావరాలపై శుక్రవారం నిర్వహించిన దాడిలో 700 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా డీపీఈఓ ఆదేశాల మేరకు సీతానగరం ఎక్సైజ్ స్టేషన్ సీఐ పద్మావతి, గజపతినగరం, బొబ్బిలి, కురుపాం ఎక్సైజ్ స్టేషన్‌ల ఎస్సైలు నరేంద్రకుమార్, శ్రావణ్‌కుమార్, జె.రాజశేఖర్ తదితర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారన్నారు. ఆ స్థావరంలో సారా తయారీ కోసం పులియబెట్టేందుకు ఉపయోగించిన ప్లాస్టిక్ టబ్బులతో పాటు 10 లీటర్ల సారాను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అంతేకాకుండా సారా తయారీ శిబిరం నిర్వహిస్తున్న వారితో పాటు ముడిసరుకులు సరఫరా చేసే కోసం దర్యాప్తు నిర్వహిస్తున్నామని, దర్యాప్తులో వాస్తవాలు తేలితే చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

కొత్తవలసలో 200 లీటర్ల బెల్లం ఊట



కొత్తవలస: బెల్లం ఊటను ధ్వంసం చేసిన పోలీసులు

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామం సమీపంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జీఎస్.రాజశేఖర నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్లు పులబెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే 4 లీటర్ల సారాను పారబోశారు. పోలీసుల అలికిడిని గమనించిన తయారీదారులు అక్కడి నుంచి జారుకున్నారు. సారా తయారీ, రవాణా, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సీఐ తెలిపారు. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సై వీఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన దాలినాయుడు

పార్వతీపురం రూరల్: మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషి కుమారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన జక్కు దాలినాయుడు (82) కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 12ఏళ్ల క్రితం భార్య మృతిచెందింది. అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తుండగా ఇటీవల కాలికి గాయం కావడంతో శస్త్ర చికిత్స చేశారు. గాయం ఎప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంటిముందు ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డీఐజీ ఆధ్వర్యంలో నాకాబందీ

- విజయనగరంలో రెండు గంటల పాటు పోలీసుల తనిఖీలు
- 20 కిలోల వెండి, 50 వాహనాలు సీజ్

విజయనగరం క్రైమ్:

నాకాబందీ, కార్డన్‌సెర్చ్‌లు వంటి స్పెషల్ ఆపరేషన్లతో పోలీసులు జిల్లాలో తాము ముందుగా నిర్దేశించిన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ క్రమంలో విజయనగరంలో గురువారం రాత్రి విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆధ్వర్యంలో ఎస్పీ వకుల్ జిందల్ స్వీయ పర్యవేక్షణలో ఆకస్మిక త నిఖీలు చేశారు. రాత్రి రెండు గంటల పాటు విస్తృతంగా విజయనగరాన్ని మొత్తం పోలీసులు జల్లెడ పట్టారు. నగరంలోని వై జంక్షన్, వీటీఅగ్రహారం, మయూరీ జంక్షన్, రైల్వే స్టేషన్, ఎత్తుబ్రిడ్జి, ఆర్‌అండ్‌బీ, కంటోన్మెంట్, కలెక్టరేట్, ఉడాకాలనీ, కామాక్షినగర్, గంటస్తంభం, గూడ్స్ షెడ్, కన్యకాపరమేశ్వరి టెంపుల్, మూడు లాంతర్లు, నీళ్ల ట్యాంక్, దాసన్నపేట, కోట జంక్షన్‌లో ముగ్గురు డీఎస్పీలు,14 మంది సీఐలు, 44 మంది ఎస్సైలు 276 మంది కానిస్టేబుల్స్‌తో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ఈ ఆకస్మిక తనిఖీలో 51 వాహనాలను సీజ్ చేశామన్నారు. అలాగే 4,437 వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని చెప్పారు. ప్రధానంగా వన్ టౌన్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 20 కిలోల వెండిని పట్టుకున్నామని తెలిపారు. అలాగే ఒక ఇసుక లారీ, 8 మద్యం బాటిల్స్ సీజ్ చేశామని చెప్పారు. మద్యం తాగిన వారిపై వంద కేసులు బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై రెండు కేసులు నమోదు చేశామని ఎస్పీ వివరించారు. ఆకస్మిక తనిఖీల్లో విజయనగరం కలెక్టరేట్ జంక్షన్ వద్ద విజయనగం టౌన్ డీఎస్పీ శ్రీనివాస్, బొబ్బిలిలో డీఎస్పీ భవ్యా రెడ్డి, చీపురుపల్లి రైల్వేస్టేషన్ వద్ద డీఎస్పీ రాఘవులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారని ఎస్పీ వకుల్ జిందల్ ఈ సందర్భంగా తెలియజేశారు.



విజయనగరం కోట వద్ద తనిఖీలు చేపడుతున్న ఎస్పీ వకుల్ జిందల్



పార్వతీపురం రూరల్: సిబ్బందితో కలిసి వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి

చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు నాకాబందీ

పార్వతీపురం రూరల్: చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్ (నాకాబందీ) చేపట్టినట్లు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన స్వయంగా గురువారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలో ఉన్న అంతర్రాష్ట్ర రహదారిపై సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఆయా స్టేషన్ల ఎస్సైలు వారి పరిధిలో ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ప్రధానంగా చెక్‌పోస్టుల వద్ద, ప్రధాన కూడలివద్ద స్టాపర్లు ఏర్పాటు చేసి గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమరవాణా, మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, అధిక లోడ్ ఉన్న వాహనాలు, రికార్డుల పరిశీలన, పెండింగ్ చలానాలు తదితర చట్ట వ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ఈ ఆకస్మిక తనిఖీలు ఒకేరోజు జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ అధికారులు నిర్వహించినట్లు తెలిపారు. ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పార్వతీపురం ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ శివారు ప్రాంతాలైన వెంకంపేట గోరీలు, ఎస్‌వీడీ కళాశాల వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో స్వయంగా పాల్గొని వచ్చిపోయే వాహనాలను ఆపి సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

జీడికి దక్కని మద్దతు!

- దళారుల పాలవుతున్న గిరిజన రైతులు
- ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారుల హామీలు

సాక్షి, పార్వతీపురం మన్యం :

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు అటవీ ఉత్పత్తుల్లో ఆర్థిక దన్నుగా నిలిచేది జీడి పంటే. కొండ పోడు భూముల్లో జీడితోటలనే సాగు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఇటువంటి పంట విషయంలో ప్రభుత్వం వారికి మద్దతుగా నిలవడం లేదు. సీజన్ దాటిపోతున్నా.. జీడి పిక్కల కొనుగోలు విషయమై కనీస దయ కరవవుతోంది. కొంత కాలంగా మార్కెట్లో సరైన ధర పొందలేకపోతున్నారు. మరోవైపు మొదట్లోనే తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోతోంది. దీనివల్ల గిరిజన రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. జీడి పిక్కలకు కనీస మద్దతు ధర చెల్లించాలని కొన్నాళ్లుగా రైతులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నా ఫలితం ఉండటం లేదు.




జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని ఇటీవల పార్వతీపురం ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న గిరిజన, ప్రజాసంఘాల నాయకులు

వేలమంది గిరిజన రైతులకు ఆధారం..

జిల్లాలో దాదాపు 68 వేల ఎకరాల్లో జీడి తోటలు సాగులో ఉన్నాయి. 30 వేల మంది రైతులు వీటిపైనే ఆధార పడి జీవిస్తున్నారు. ఇందులో అత్యధికం గిరిజనులే. జీడిపిక్కల దిగుబడి దాదాపు మార్చి నాటికి వస్తున్నప్పటికీ.. ఏప్రిల్ వచ్చినా జీసీసీ ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికే గిరిజనులు దాదాపు 60 శాతం జీడి పిక్కలు దళారులకు విక్రయించేశారు.

సిండికేట్‌గా మారుతున్న వ్యాపారులు

జిల్లాలోని సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు జీడి తోటలపైనే చాలా ఏళ్లుగా బతుకుతున్నారు. ప్రస్తుతం జీడి పిక్కల ధర మార్కెట్లో కిలో రూ.180 వరకు ఉంది. గిరిజనులకు పంట చేతికందేసరికి దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారుతున్నారు. జీడి పిక్కలను కిలో రూ.100 నుంచి రూ.130లోపే కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిరిజన రైతులకు పెట్టుబడి కూడా దక్కడం లేదు. వరి, మొక్కజొన్న, పత్తి మాదిరి జీడి పిక్కలకు మద్దతు ధర ఇవ్వాలని.. జీసీసీ, వెలుగు ద్వారా కొనుగోలు కేంద్రాలు తెరవాలని ఎప్పటి నుంచో ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నా ఫలితం దక్కడం లేదు. వాస్తవానికి మన్యం జిల్లా జీడికి మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు ఏటా ఈ సీజన్ అధికంగా రవాణా అవుతోంది. కనీసం జీడి పిక్కలను నిల్వ చేసుకునేందుకు గోదాములు కూడా జిల్లాలో అందుబాటులో లేవు.



ప్రకటనలకే పరిమితమవుతున్న ప్రాసెసింగ్ యూనిట్లు

జీడి పిక్కల ద్వారా మంచి ఆదాయం పొందేలా ఐటీడీఏల పరిధిలో ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించాలని అధికారులు తరచూ ప్రకటనలైతే చేస్తున్నారు గానీ.. ఆచరణలోకి రావడం లేదు. జీడి పప్పు మార్కెటింగ్‌లో రైతులు దళారుల బారిన పడకుండా వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా మంచి ధర కల్పించేలా చూడాలని ఐటీడీఏ, వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరుల్లో యూనిట్లను స్థాపించనున్నట్లు చెబుతున్నారు. ఇవన్నీ ప్రకటనలకే పరిమితమవుతున్నాయి.

జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి..

జీడి పిక్కలకు కిలో రూ.200, 80 కిలోల బస్తా రూ.16 వేల చొప్పున మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని పలు సందర్భాల్లో గిరిజన, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. వారి రోదనను పట్టించుకునే తీరిక ఎవరికీ ఉండటం లేదు. ఇటీవల పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు కూడా నిర్వహించారు. అయినప్పటికీ అధికారుల్లో చలనం రాలేదని గిరిజన సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.